


జెండా పండుగపై

కార్పొరేషన్‌లో గందరగోళం

◆ ఏర్పాట్లలో సమన్వయలోపం ◆ టెండర్ల నిర్వహణలోనూ అయోమయం



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతి ఏడాది స్వాత్రంత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లను చేస్తుంటారు. అయితే ఆ సారి రానున్న 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణలో గందరగోళం కన్పిస్తోంది. ఈ వేడుకల నిర్వహణకు అవసరమైన కార్యక్రమాలు, పనులు చేపట్టడానికి నామినేషన్ల పద్ధతిలో కాకుండా షార్ట్ టెండర్ల ప్రక్రియలో చేపట్టాలని కమిషనర్ భాగ్యలక్ష్మి ఇటీవల నిర్ణయించారు. ఆఫీస్ నిర్వహణ బాధ్యతలు చూసే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేఖర్ పదిరోజుల సెలవుపై వెళ్లారు. దీంతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై కార్పొరేషన్‌లో గందరగోళం నెలకొంది. బుధవారం నుంచి తిరంగా యాత్రను నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదిశగా అధికారులు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయితే కార్పొరేషన్‌లో ఈ ఏర్పాట్లు చేసే అధికారులే కరువయ్యారు. ఐదు రోజుల క్రితమే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాక్షాయిని, అసిస్టెంట్ ఇంజినీర్ ఉమామహేశ్వరిలకు ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు అవసరమయ్యే ఏర్పాట్లలో భాగంగా మిలీనియం జెండా, టవర్‌క్లాక్ విద్యుదీపాలంకరణ, మున్సిపల్ కార్పొరేషన్ విద్యుత్ దీపాలంకరణ, ఫ్లెక్సీల ఏర్పాటు, స్టాండ్ బైసెల్ఫీ తీసుకునే విధంగా చర్యలు చేపట్టడానికి వీలుగా షార్ట్ టెండర్ల నిర్వహణకు అవసరమయ్యే అంచనాలను తయారు చేయాలని సూచించారు. వీటిపై మేయర్ మహమ్మద్ వసీం పరిశీలన తర్వాత ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఫోనులో తెలిపారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను నామినేషన్ పద్ధతిలో కాకుండా షార్ట్ టెండర్ల ప్రక్రియలో చేపట్టాలని స్వయంగా కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించినట్లు ఆయన వారికి వివరించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఇంకా వారం రోజులు మాత్రమే గడువు ఉంది. అయితే ఇప్పటివరకు ఇందుకు సంబంధించి షార్ట్ టెండర్లను పిలిచిన దాఖలాలు లేవు. కనీసం నామినేషన్‌కు సంబంధించి కూడా టెక్నికల్ అనుమతి పొందని పరిస్థితి కార్పొరేషన్‌లో ఉంది. నామినేషన్ పద్ధతిలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల పనులు అప్పగిస్తారని తెలియడంతో కొందరు కాంట్రాక్టర్లు మిలీనియం జెండాను సైతం ముందస్తుగా తీసుకొచ్చి సిద్ధం చేశారు. కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలు షార్ట్ టెండర్ నిర్వహించకుండా కాంట్రాక్టర్లు చక్రం తిప్పారు. దీన్ని బట్టి చూస్తే కార్పొరేషన్‌లో పాలకవర్గం నిర్ణయాలు చెత్తబుట్ట దాఖలు అవుతున్నాయనే విషయం స్పష్టం అవుతోంది. మంగళవారం సాయంత్రం నాటికి వేడుకల నిర్వహణపై అధికారుల్లో కొంత హడావుడి కన్పించింది. కార్యాలయం నిర్వహణతో సంబంధం లేని అధికారులకు పనులు అప్పగించడం చూస్తే కార్పొరేషన్‌లో పరిపాలన ఎంత అస్తవ్యస్తంగా ఉందో ఇట్టే అర్థం అవుతోంది. ఇంతటి గందరగోళ పరిస్థితుల నడుమ ఈ వేడుకలు ఎలా నిర్వహిస్తారా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

ఖరీఫ్ ఆశలు ఆవిరి





◆ మూడొంతులు బీడు
◆ సగానికి పడిపోయిన వేరుశనగ సాగు
◆ కంది, ఆముదంలో పెరుగుదల

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ఆశలు ఆవిరయ్యాయి. సీజన్‌కు కీలకమైన జూన్, జులై మాసాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఆఖరులో పడినప్పటికీ సరైన పదును అవలేదు. ఈ ప్రభావం ఖరీఫ్ సాగుపై తీవ్రంగా పడింది. సాధారణ సాగులో 38 శాతం పంట సాగవలేదు. ప్రభుత్వమూ ప్రత్యామ్నాయంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగు కూడా ప్రశ్నార్థకంగానే మారుతోంది. సీజన్ ఆఖరులో వర్షాలు పడినపప్పటికీ చాలా చోట్ల ఇప్పటికీ పదును అవలేదు. ఇది సాగుపై ప్రభావాన్ని చూపింది.

38 శాతం బీడు

అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు ఈ ఏడాది 9.15 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కాని సాగైంది కేవలం 5.67 లక్షల ఎకరాల్లోనే. 62 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇందులో ప్రధానంగా సాగయ్యేది వేరుశనగ పంట. 5.71 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవుతుందని అనుకుంటే 2.84 లక్షల ఎకరాల్లోనే విత్తనం పడింది. ఇప్పటికే వేరుశనగ సాగుకు సమయం కూడా మించిపోవడంపై ఇకపై సాగు విస్తీర్ణం వేరశనగ పడే అవకాశం లేదు. వరి సాగు కూడా 25 శాతానికే పరిమితమైంది. జిల్లాలో వరి ఖరీఫ్‌లో 43 వేల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా కేవలం పది వేల ఎకరాల్లోనే సాగైంది. ఇలా ప్రధాన పంటలు రెండూ సాగు పరిమితంగానే సాగవడం గమనార్హం. పత్తి పంట సాధారణ సాగు 1.27 లక్షల ఎకరాలు అవుతే ఇప్పటి వరకు సాగైంది 78 వేల ఎకరాల్లోనే.

పెరిగిన ఆముదం, కంది

అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయినప్పటికీ కంది, ఆముదం పంటల సాగు విస్తీర్ణం మాత్రం వంద శాతానికి దాటి సాగైంది. కంది పంట సాధారణ సాగు జిల్లాలో 74 వేల ఎకరాలవుతే 86 వేల ఎకరాల్లో సాగైంది. సాధారణం కంటే 116 శాతం అధికంగా సాగైంది. ఆముదం పంట 30 వేల ఎకరాల్లో సాగైంది. 40 వేల ఎకరాల్లో సాగైంది. 133 శాతం అత్యధిక విస్తీర్ణంలో సాగైంది.ఇక తక్కిన పంటలన్నీ సాధారణం కంటే చాలా తక్కువగా సాగై ఉన్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయి ఉన్నారు. పంటలు సాగు చేసుకోలేని పరిస్థితుల్లోనున్నారు. రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలతోపాటు పెట్టుబడి రాయితీని అందించి ఆదుకోవాలి.

చంద్రశేఖర్‌రెడ్డి
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

బాలికల కోసం అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టర్ ఎం.గౌతమి



జిల్లాలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాలు మరియు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ యం. గౌతమి ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం (1994, రూల్స్ 1996, పిసి, పిఎన్డిటి యాక్ట్)అమలుకు సంబంధించి జిల్లాస్థాయి జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, సచివాలయం ఏఎన్ఎం, మహిళా పోలీస్, అంగన్వాడీ వర్కర్, ఆశా వర్కర్ కమిటీగా ఏర్పడి కలిసి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మండల స్థాయిలో తహసీల్దార్ చైర్మన్ గా, మెడికల్ ఆఫీసర్ కన్వీనర్‌గా, ఎంపీడీవో, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఆశా నోడల్ ఆఫీసర్, స్వచ్ఛంద సంస్థ బాధ్యులు ఒక కమిటీగా ఏర్పడి మండల స్థాయిలో బాలికల నిష్పత్తి సమానంగా ఉండేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ఉన్నత పాఠశాలలలో, కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాలలలో ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వైద్య సిబ్బంది ఏర్పాటు చేయాలని, ఇవన్నీ ఒక యాక్షన్ ప్లాన్ ప్రకారం నిర్వహించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, నిరంతరం కొనసాగించినప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥యుగంధర్, అదనపు జిల్లా పోలీస్ అధికారి విజయ భాస్కర్ రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌బిఐలో ఘరానామోసం

◆ బ్యాంకు నిధులను మళ్లించిన మేనేజర్
◆ రూ.1.07 కోట్లు దుర్వినియోగం అయినట్లు గుర్తింపు
◆ పోలీసులకు బ్యాంకు ఉన్నతాధికారుల ఫిర్యాదు



అజ్ఞాతంలోకి వెళ్లిన బ్యాంకు మేనేజర్ ఫణికుమార్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని కణేకల్ రోడ్డులో గల భారతీయ స్టేట్ బ్యాంక్ కార్యాలయంలో ఘరానా మోసం వెలుగు చూసింది. రూ.1.07 కోట్లు దుర్వినియోగం అయినట్లు ఆ బ్యాంకు ఉన్నతాధికారులు గర్తించారు. ఇదివరకు ఈ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసిన ఎస్ఎల్ఎన్.ఫణికుమార్ బ్యాంకు ఖాతాదారులకు చెందిన 1,07,30,023 రూపాయలు సొమ్మును తన తల్లి, ఇతరుల ఖాతాలకు అక్రమంగా బదిలీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిని గుర్తించిన స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకటేశ్వరరావు దీనిపై విచారణ చేపట్టారు. సదరు బ్యాంకు మేనేజర్ ఫణికుమార్‌పై రాయదుర్గం పోలీస్ స్టేషన్లో గత జూన్ నెల 21న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పటినుండి ఫణికుమార్ పరారీలో ఉన్నారు. బ్యాంకు ఉన్నత అధికారులు బ్యాంకులో విచారణ జరిపి దుర్వినియోగానికి గురైన ఖాతాదారుల సొమ్మును తిరిగి వారి ఖాతాలకు జమచేశారు. బ్యాంకులో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన మేనేజర్ ఫణికుమార్ అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఆయనకోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ ఇన్స్పెక్టర్ లక్ష్మన్న తెలిపారు. భారతీయ స్టేట్ బ్యాంకులో ప్రజల ఖాతాదారుల సొమ్ము దుర్వినియోగం కావడంపై ప్రజలు, ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకు వ్యవహారాలు చక్కదిద్దాల్సిన మేనేజరే నిధుల దుర్వినియోగానికి పాల్పడటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర విధానాలతో విద్యారంగం నిర్వీర్యం



గుంతకల్లులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

◆ మతంపేరుతో విద్యలోనూ బిజెపి చిచ్చు
◆ మోడీ అడుగులకుమడుగులొత్తుతున్న జగన్
◆ విద్యారంగ పరిరక్షణకు పోరాటాలు
◆ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్

ప్రజాశక్తి-గుంతకల్లు

మతాల పేరుతో విద్యార్థుల మధ్య చిచ్చురేపి, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బిజెపి విధానాలు ఉన్నాయని విద్యార్థిలోకం ఇలాంటి వాటిని తిప్పికొట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. విద్యారంగ పరిరక్షణ కోరుతూ గుంతకల్లు పట్టణంలో రెండు రోజులు పాటు జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి ప్లీనరీ సమావేశాలు మంగళవారం నాడు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలో కళాశాలల విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహం నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అజంతా కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 8, 9వ తేదీల్లో గుంతకల్లు వేదికగా జిల్లా ప్లీనరీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో తమ పార్టీ అధికారంలోకి వేస్తే విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ అడుగులకు మడుగులు ఒత్తుతూ జగన్ రెడ్డి లోపుభయిష్టమైన నూతన విద్యా విధానాన్ని అమలులో చేస్తున్నారన్నారు. 3,4,5 తరగతులున్న ప్రభుత్వ పాఠశాలలు మూతవేయడం కోసం కుట్ర జరుగుతోందన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గహాల్లో పేద మధ్య తరగతి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. మంచినీరు, నాణ్యమైన భోజనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలల నుంచి మెస్ కాస్మోటిక్ ఛార్జీలు కూడా ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి వెంటనే కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలన్నారు. ఇంటర్ కళాశాలలో తరగతులు ప్రారంభమై రెండు నెలలు గడిచినప్పటికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. పాఠ్య పుస్తకాలను ఇవ్వకపోగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పాఠ్యపుస్తకాలు ఇవ్వలేమని పత్రికా ప్రకటన చేయడం సిగ్గుచేటన్నారు. విద్య రంగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అవసరమైతే సిఎం కార్యాలయాన్ని ముట్టడించేందుకు విద్యార్థిలోకాన్ని సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, జిల్లా నాయకులు సిద్ధప్ప, గిరి, వెంకటేష్, శివ, విజయ్, చందు, సూరి, ప్రతాప్‌తో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

గ్రామ పంచాయతీ కార్మికుల చర్చలు సఫలం

బకాయి వేతనాల చెల్లింపునకు చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రామ పంచాయతీ కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ పోరాటాలు చేస్తున్న నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులతో నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి. మంగళవారం డిపిఓ తన కార్యాలయంలో సిఐటియు, గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ నేతలు, డిఎల్‌పిఓలు, గ్రామ సచివాలయాల కార్యదర్శులతో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏజి.రాజమోహన్, జగన్‌మోహన్‌రెడ్డి, గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు టి.గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ తదితరులు హాజరై సమస్యలపై చర్చించారు. సమస్యలపై స్పందించిన డిపిఓ బకాయి పడిన వేతనాలను తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోస్ట్ శాంక్షన్‌లు ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉన్నాయో అక్కడ ఎలా జీతాలు ఇస్తున్నారో కార్యదర్శులందరికీ మెమోలు ఇచ్చి వారి నుంచి రికవరీ పెట్టమని ఏఓ విశ్వనాథ్‌రెడ్డికి ఆదేశించారు. దీంతో యూనియన్ నాయకులు కలెక్టర్ ఎమ్.గౌతమి, డిపిఓ ప్రభాకర్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు బాలాజీ నాయక్, మధు, బాషా, నాగభూషణ, కుల్లాయమ్మ, వేణు, నాగముని, పెద్దన్న, రాజు, గంగన్న, నారాయణస్వామి పాల్గొన్నారు.

వార్డుల ఉపఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

బొమ్మనహాల్ : మండలంలోని శ్రీధర్‌ఘట్ట పంచాయతీ పరిధిలోని 3, బొల్లనగడ్డం 3వ వార్డులకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ షకీలాబేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8 నుండి ఆగస్టు 10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఎన్నికలకు సహకరించాలని కోరారు.

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుడు స్థానానికి ఉప ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపిడిఓ యోగానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 10వ తేదీ సాయంత్రం వరకూ నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. 11న నామినేషన్ల పరిశీలన, 14న ఉపసంహరణ 19న ఎన్నికలు, అదే రోజు లెక్కించనున్నట్లు తెలిపారు.

నరిగమ్మ ఆలయాన్ని తొలగించాలి : సిపిఎం

అనంతపురం కలెక్టరేట్ : రోడ్డు ప్రమాదాలకు కారణమవు తున్న కళ్యాణదుర్గం రోడ్డులో నరిగమ్మ ఆలయాన్ని తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఎం నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం నడిరోడ్డులో ఆలయం ఉన్నందున ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నాలుగు లైన్ల రహదారి ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ రోడ్డు మధ్యలో ఉన్న నరిగమ్మ గుడిని తొలగించడానికి అధికారులకు చేతులు రావడం లేదన్నారు. ఆలయం ఎదుట అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. తక్షణమే ఉన్నతాధికారులు, రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి నరిగమ్మ ఆలయం తొలగించి, ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో నిర్మించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుదాం

నేడు మహాపడావ్ : ట్రేడ్ యూనియన్ నేతల పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని దెబ్బతీసేలా అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడదామని ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం క్విట్ ఇండియా స్ఫూర్తి పెంపొందించుకునే కార్యక్రమంలో భాగంగా ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, జె.రాజారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగభూషణ, వై.వెంకటనారాయణ, ఎటిఎం.నాగరాజు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, ఐఎఫ్‌టియు నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవస్థలను నాశనం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరణ చేస్తోందన్నారు. కార్మికుల శ్రమ దోపిడీ, వెట్టి చాకిరీ పునరావృతం అయ్యేలా కార్మిక చట్టాలు సవరించి యాజమాన్యాలకు ఊడిగం చేస్తోందన్నారు. లక్షల పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్మికులకు రక్షణ చట్టాలు యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు మార్చుకుని ప్రజలు, కార్మికులు, రైతులు, విద్యార్థులకు ఆమోదయోగ్యమైన పరిపాలన అందించాలని కోరుతూ నేడు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహా పడావ్, మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసులు, ఎర్రిస్వామి, తిరుమలేష్, ఆదినారాయణ, చీమల ప్రకాష్‌రెడ్డి, ఇస్మాయిల్, ఏఐటియుసి నాయకులు కృష్ణుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.




శ్రీకంఠం సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేస్తున్న ట్రేడ్ యూనియన్ల నాయకులు

మొన్న భార్య.. నిన్న భర్త..

రైలు కింద పడి ఆత్మహత్య..

కుటుంబ కలహాలే కారణమంటున్న బంధువులు



మంజునాథ్, రమాదేవి (పాతచిత్రాలు)

తాడిపత్రి రూరల్ : ఒకరినొకరు ప్రేమించుకున్నారు.. కలకాలం తోడుగా ఉండి జీవించాలని సంకల్పించారు.. దీంతో పెద్దలను సైతం ఎదిరించడంతోపాటు పట్టుబట్టి ఇరు కుటుంబాలనూ ఒప్పించి వివాహం చేసుకున్నారు.. కానీ వారు ఊహించుకున్నట్టు.. కలలు కన్నట్టు కనీసం ఆరు నెలలు కూడా జీవించలేకపోయారు.. ఇద్దరి మధ్య ఏ కలహాలు వచ్చాయో.. ఏమో తెలియదు.. ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి దారితీసింది..

వివరాల్లోకి వెళ్తే...

పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన రమాదేవి (24), తాడిపత్రి మండలం చిన్న పొలమడకు చెందిన మంజునాథ (25) ఒకరినొకరు ప్రేమించుకున్నారు. అయితే వీరి పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. అయితే పెద్దలను ఎదిరించడంతోపాటు ఇరు కుటుంబాలనూ ఒప్పించి ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం చేసుకున్నారు. రమాదేవి వివాహానికి ముందు వరకూ తాడిపత్రిలోని ఆదర్శ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిపై వార్డెన్‌గా విధులు నిర్వహించేవాడు. అయితే పెళ్లి అయిన తర్వాత ఉద్యోగం వదిలేసింది. ఇద్దరూ అన్యోన్యంగానే జీవిస్తున్నారని బంధువులు, ఇరు కుటుంబాలు భావించాయి. ఈనేపథ్యంలో గత సోమవారం సాయంత్రం భర్త ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రమాదేవి ఇంటి నుంచి బయటకు వచ్చి తాడిపత్రి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. దీంతో కట్నం కోసమే తమ కుమార్తెను వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని రమాదేవి బంధువులు ఆరోపించారు. దీనికితోడు పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు. ఈనేపథ్యంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య చనిపోవడంతోపాటు తనపైనే ఆరోపణలు రావడం.. కేసు నమోదు కావడంతో మనస్థాపం చెందిన మంజునాథ్ మంగళవారం గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్ వద్దకు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యాభర్తల మధ్య నెలకొన్న కుటుంబ కలహాలే ఆత్మహత్యలకు కారణమని బంధువులు తెలిపారు. ఇరువురి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ప్రమీల



ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా సిహెచ్.ప్రమీలను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో విడుదల చేసింది. మండలంలోని సి.బండమీదపల్లికి చెందిన ప్రమీల చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడం విశేషం. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు క్షేమం

సవీరా ఆసుపత్రి కన్సల్టెంట్ ఒబెస్ట్రిక్స్, గైనకాలజిస్టు పి.శిల్పాచౌదరి



ప్రజాశక్తి-అనంతపురం

పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు పిల్లలకు తల్లిపాలు పట్టించడం ద్వారానే మంచి ఆరోగ్యం లభిస్తుందని సవీరా ఆసుపత్రి కన్సల్టెంట్ ఒబెస్ట్రిక్స్, గైనకాలజిస్టు పి.శిల్పాచౌదరి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ప్రోటీన్లు, కార్బొహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు కలిగి ఉంటాయన్నారు. అంతేగాకుండా పిల్లలకు ఇన్ఫెక్షన్లతో పోరాడటంతోపాటు రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయ పడతాయన్నారు. అయితే తల్లిపాలు తాగే పిల్లలకు చెవి ఇన్ఫెక్షన్లు, న్యుమోనియా, డయేరియా వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. సాధారణంగా ఫార్ములా ఫీడ్ కంటే మెరుగైన రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. అంతేగాకుండా తల్లిపాలు తాగే పిల్లలకు ఆస్తమా, తామర, అటోపిక్ చర్మ సంబంధిత వంటి అలర్జీలు వచ్చే ప్రమాదం తక్కువ. తల్లిపాలు తాగే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. శిశువులు అధిక బరువు, ఊబకాయం కాకుండా పెరిగే కొద్దీ సరైన బరువు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. తల్లి పాలివ్వడం వల్ల శిశువుతో పాటు తల్లికీ అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గర్భధారణ బరువును వేగంగా తగ్గించడానికి సహాయపడుతుందన్నారు. ప్రసవానంతర రక్తస్రావం తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. అలాగే రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. అయితే తల్లులు కూడా ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. నవజాత శిశువులకు తల్లిపాలు ఇవ్వడం గురించి సవీరా ఆసుపత్రి బలంగా విశ్వసిస్తుందన్నారు. ప్రతి నవజాత శిశువుకు తల్లి స్పర్శ అనేది చాలా ముఖ్యం అన్నారు. తల్లిపాలను త్వరగా ఇవ్వడానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చనుబాలు ఇవ్వడంలో శిక్షణ పొందిన నర్సులు, ఇతర సహాయక సిబ్బంది తమ వద్ద ఉన్నట్లు వివరించారు.

దోపిడీదారులకు అభివృద్ధిపై మాట్లాడే అర్హత లేదు

'కాలవ'కు ప్రజలే బుద్ధి చెబుతారు : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

అవినీతి, దోపిడీదారుడైన మాజీమంత్రి కాలవ శ్రీనివాసులుకు అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదని విప్ కాపు రామచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, చీఫ్‌విప్‌గా, మంత్రిగా రాయదుర్గానికి కాలవ శ్రీనివాసులు చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులు కట్టావా.. తాగు, సాగునీరు ఇచ్చావా.. గృహ నిర్మాణ మంత్రిగా ఇళ్లు కట్టించావా.. అని నిలదీశారు. ఉత్తుత్తి జీవోలతో చెత్త కాగితాలను ప్రజల ముఖం మీద కొట్టి సమయాన్నంతా దోపిడీకే కేటాయించి విషయం ప్రజలకు తెలిసి ప్రస్తుతం ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. కణేకల్లు చెరువులో పూడికతీత 'పేరుతో', బిటిపి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభం 'పేరుతో', ఇసుక దిబ్బల్లో ఎడారి నివారణ పనులనే డ్రామాలతో, రెయిన్ గన్స్, నీరు-చెట్టు, ఫారంపాండ్, ఇంటింటికీ మరుగుదొడ్డి 'పేరుతో' రూ.కోట్లు దోపిడీ చేశావని ఆరోపించారు. అంతేగాకుండా బోరు బావులు, శ్మశానాలను కూడా లెక్కచేయకుండా ఇసుక దోపిడీ చేశావన్నారు. ఇప్పటికైనా కాలవ శ్రీనివాసులు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో గతం కంటే ఇంకా ఘోరపరాభవం తప్పదని హెచ్చరించారు.

జిల్లాకు చేరిన కాంప్లెక్స్ ఎరువులు

అనంతపురం : కోరమాండల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన 1739.75 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు మంగళవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు చేరినట్లు ఎడిఎ రవి తెలిపారు. ఈమేరకు ఎరువులను తనిఖీ చేసినట్లు తెలిపారు. జిల్లాకు వచ్చిన ఎరువుల్లో 928 మెట్రిక్‌టన్నులు 14.35.14 ఎరువులు, 543 మెట్రిక్ టన్నుల 20.20.0.13 ఎరువులు, 268.75 మెట్రిక్ టన్నుల 28.28.0 కాంప్లెక్స్ ఎరువులు ఉన్నట్లు వివరించారు. మార్కుఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేసిన ఎరువుల వివరాలను కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మకు పంపినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాప్తాడు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వప్రసాద్, కోరమాండల్ ఫర్టిలైజర్ డిస్ట్రిబ్యూటర్ సిరుగుప్ప వెంకటేష్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి

గుత్తి : ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు గద్దర్‌కు పలు పార్టీల నాయకులు మంగళవారం గుత్తిలో నివాళులర్పించారు. ఇందులో భాగంగా సిపిఎం, సిపిఐ, ఎపి ఎమ్మార్పీఎస్, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాలేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాల గురించి నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్, నాయకులు శివ, లాలెప్ప, డప్పు ఓబులేసు, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, మధుసూదన్, వెంకటరాముడు, రాజు, పూల మాబు, బీఎస్పీ నాయకులు బి.వెంకట కొండయ్య, బండల రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎన్.వీరన్న, చలపతి, మాజీ సర్పంచి జి.తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహరం వేడుకలు

అనంతపురం : నగరంలోని 10వ డివిజన్ పరిధిలో ఉన్న ఫెర్రర్ కాలనీలో మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారుజామున నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, జి.మురళీకృష్ణ, వడ్డెర సంఘం నాయకులు వడ్డే శ్రీనివాసులు, వడ్డే విజయ్, యువజన సంఘం నాయకులు శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు మహబూబ్‌బాషా, రవి, దుర్గా, రాము, తదితరులు పాల్గొన్నారు.

పందులను తరలించాలి : కమిషనర్ రవి

తాడిపత్రి : పట్టణానికి దాదాపు 5 కిలోమీటర్ల దూరం వరకూ పందులను తరలించాలని మున్సిపల్ కమిషనర్ రవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పట్టణ పరిధిలో పందుల సంచారాన్ని నిషేధించినట్లు తెలిపారు. ప్రజారోగ్యాన్ని మెరుగు పర్చడంలో భాగంగా యజమానులు కూడా అధికారులక సహకరించి పట్టణానికి దూరంగా పందులను తరలించుకోవాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రీ సర్వేకి సహకరించాలి : తహశీల్దార్

బుక్కరాయసముద్రం : భూ రీ సర్వేకు ప్రజలు సహకరించాలని తహశీల్దార్ రమాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందల సంవత్సరాల తర్వాత జరుగుతున్న రీసర్వే కావున రైతులందరూ సర్వే చేసిన రోజు భూముల వద్దకు వెళ్లి తమ భూములకు హద్దులు చూపించుకోవాలన్నారు. దీనివల్ల హద్దు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ డిటి నారాయణస్వామి, మండల సర్వేయర్ రఘునాథ్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సంధ్య, విఆర్ఒ రాధ, విలేజ్ సర్వేయర్లు, సింగిల్‌విండో ఛైర్మన్ గువ్వల పెద్ద వెంకటరెడ్డి, చెన్నంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

తాడిపత్రి : పట్టణంలోని నందలపాడు ప్రాంతానికి చెందిన 90 కుటుంబాలు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో మంగళవారం వైసీపీలో చేరాయి. నందలపాడుకు చెందిన జోయల్ గణేష్, ఏసురత్నం, యోహన్, వర ప్రసాద్, అంథోని, సత్య, శివ, నవదీప్, నరసింహులు, కిషోర్ కుటుంబాలతోపాటు పలువురు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

గార్లదిన్నె : విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించినప్పుడే ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకోగలుగుతారని ఎపి ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాల, ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వంట గదులు, హాస్టళ్లను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ కాలనీలో ఉన్న మరో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ సాయిరాం, తహశీల్దార్ ఉషారాణి, ఎంఇఒ తారా చంద్రానాయక్, వెంకటరమణనాయక్, సీఆర్పీలు వెంకటరాముడు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ గౌతమికి సిఐటియు, విఆర్ఎ సంఘం నేతల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఎ)ల సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ విఆర్ఎలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రెండు రోజుల రిలే దీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతక మునుపు నిర్వహించిన దీక్షలో విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న మాట్లాడుతూ విఆర్ఎలకు పేస్కేలు అమలు చేయాలన్నారు. నామీనులుగా పని చేస్తున్న వారందరినీ విఆర్ఎలుగా నియమించాలన్నారు. అర్హులకు విఆర్ఒ, అటెండర్, వాచ్‌మెన్ ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. డిఎ రికవరీ నిలిపి డిఎతో కూడిన వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వరప్ప, జిల్లా కోశాధికారి నారాయణస్వామి, సుంకన్న, శ్రీనివాసులు, పెద్దన్న, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




దీక్షలు చేస్తున్న విఆర్ఎలు

తిరస్కరించిన పంటల బీమా రైతుల వివరాలను పంపండి

వ్యసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సి.హరికిరణ్

ప్రజాశక్తి-అనంతపురం

2021 ఖరీఫ్ పంటల బీమాకు సంబంధించి తిరస్కరించిన రైతుల జాబితాను తిరిగి పంపాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సి.హరికిరణ్ ఆయా జిల్లాల ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి జిల్లా వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఈ-క్రాప్ నమోదు అప్లికేషన్ ఇవ్వనున్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ పక్కాగా నమోదు చేయాలన్నారు. అలాగే అక్టోబర్ నుంచి కిసాన్ డ్రోన్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావున కిసాన్ డ్రోన్స్‌కి పైలట్ ట్రైనింగ్ ఇచ్చేందుకు ప్రతి మండలంలో తప్పనిసరిగా సీహెచ్‌సి గ్రూపు ఏర్పాటు చేసి అందులో ఒక రైతుకు కిషాన్ డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ పూర్తి చేయించాలన్నారు. అలాగే 2021 ఖరీఫ్ పంటల బీమాకు సంబంధించి ఎంపిక చేసిన రైతుల ఖాతాలో అమౌంట్ పడకుండా నెఫ్ట్ ద్వారా రిజెక్ట్ అయినా రైతుల వివరాలను పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి, పద్మజ, యల్లప్ప, లక్ష్మానాయక్, మండల వ్యవసాయ అధికారులు, సాంకేతిక వ్యవసాయ అధికారులు బాలానాయక్, రాకేష్‌నాయక్, వెంకటకుమార్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

అన్నదాత అభివృద్ధే ధ్యేయం

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-గార్లదిన్నె

రైతులను అభివృద్ధి చేయడమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సిరివరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధే ధ్యేయంగా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయంపై సాంకేతిక సలహాలు అందిస్తూ, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు వివరించారు. అంతేగాకుండా ఆర్‌బికెల ద్వారానే అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అంతేగాకుండా ప్రజల వద్దకే పాలన తెచ్చారన్నారు. ప్రజల జీవితాలకు అత్యంత విలువనిచ్చే ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకట్‌నారాయణ, మండల కన్వీనర్ నరేంద్రనాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామ్మోహన్‌రెడ్డి, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ తేజోష్ణ, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆలూరు సాంబశివారెడ్డి, బోయ గిరిజమ్మ, తదితరులు

సిఎ ఫౌండేషన్ ప్రవేశ పరీక్షలో 'నలంద' విజయకేతనం

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయస్థాయి సిఎ ఫౌండేషన్ ప్రవేశ పరీక్షలో స్థానిక నలంద సిఎ అకాడమీ విద్యార్థిని జి.తనూషారెడ్డి 400కు 342 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు అకాడమీ ప్రిన్సిపాల్ ఎం.ఖాజీబాబు తెలిపారు. 2023 జూన్‌లో జాతీయ స్థాయిలో సిఎ ఫౌండేషన్ ప్రవేశ పరీక్షలు నిర్వహించగా మంగళవారం ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తనూషారెడ్డి 342 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా జె.ప్రమోదిని 314, ఎ.తరుణ్‌కుమార్‌రెడ్డి 308, శ్రీనివాస రాఘవేంద్ర 286, ఎం.సాయిశ్రీ సహస్ర 263, చైత్ర సాయి 223, వి.సాయిలీలా 215, ఎం.హర్షవర్ధన్‌రామ్-220, ఎం.ఉదయ్‌కిరణ్ 211 మార్కులతో సిఎ ఫౌండేషన్ కోర్సుకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల సిబ్బందిని ప్రిన్సిపాల్లు ఎం.ఖాజీబాబు, జె.వినోద్‌బాబు, రీజినల్ హెడ్ కేతినేని మాధవరావు, నలంద విద్యాసంస్థల ఛైర్మన్ అట్లూరి విజయబాబు అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న నలంద పాఠశాల సిబ్బంది, ఇన్‌సెట్‌లో టాపర్‌గా నిలిచిన తనూషారెడ్డి

ముళ్లపొదల్లో పసిపాప

ఆసుపత్రిలో చేర్పించిన రాజీవ్ కాలనీ సర్పంచి ఆశాబీ

ప్రజాశక్తి-అనంతపురం

నగర సమీపంలో ఉన్న రాజీవ్‌కాలనీ పరిధిలోని పిఎస్ నగర్‌లో ముళ్లపొదల్లో ఓ పసిపాప కనిపించింది. గమనించిన స్థానికులు వెంటనే సర్పంచి ఆశాబీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె పసిపాపను అక్కున చేర్చుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పసిపాప చికిత్స పొందుతోంది. తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వ చాటుకున్న సర్పంచుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, సచివాలయ ఉద్యోగులు, హెల్త్ విభాగం, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ముళ్లకంపల్లో ఉన్న చిన్నారిని చేరదీస్తున్న రాజీవ్‌కాలనీ సర్పంచి ఆశాబీ, మహిళలు

బాలికల్లోని ప్రతిభను వెలికితీయాలి

ప్రజాశక్తి-గుత్తి

గ్రామీణ బాలికల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి బి.రవినాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని రజాపురం ఎపి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీల్లో గుత్తి, పెద్దవడుగూరు మండలాల నుంచి 15 ప్రభుత్వ పాఠశాలల నుంచి 130 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న బాలికల ప్రతిభను గుర్తించి భవిష్యత్తులో క్రీడారంగంలో రాణించడానికి అథ్లెటిక్ మీట్ 20023 నిర్వహించేందుకు ఆర్డీటీ కృషి చేస్తోందన్నారు. క్రీడల ద్వారా సమానత్వాన్ని తీసుకురావచ్చన్నారు. అనంతరం విజేతలకు గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రజాపురం ఎపి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, ఆర్డీటీ గుత్తి ఎటిఎల్ జి.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కళ్లకలకపై అపోహలు వద్దు..

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కళ్లకలకపై లేనిపోని అపోహలు వీడి వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆయూష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు సూచించారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు వద్ద ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 'కళ్ల కలక నుంచి కంటిని కాపాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ల కలక వ్యాధి లక్షణాలు.. వ్యాధి రకాలు.. ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. కళ్లకలక రాకుండా ముందస్తుగా హోమియో మందులను వాడవచ్చన్నారు. అదేవిధంగా కళ్లకలక వచ్చిన వ్యక్తుల వైపు చూస్తే కళ్లకలక వస్తుందనేది అపోహ అన్నారు. అయితే కళ్ల కలక రాకుండా చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు. అలాగే కళ్లకలక వచ్చిన వారికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ సిబ్బంది సుదర్శన్‌రెడ్డి, శాంతమ్మ, హైస్కూల్ ఉపాధ్యాయురాలు హేమ, సరళ, శ్యామలాదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి తిరుపతినాయుడు

చంద్రబాబువన్నీ కుటిల రాజకీయాలు

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపి అధినేత చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పడినా.. స్వార్థ రాజకీయాలు చేసినా రాష్ట్రంలో సిఎం జగన్ వెంటే జనం ప్రజలు ఉన్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం విడపనకల్లు మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా తెలియజేస్తే వెంటనే అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉంటే జీర్ణించుకోలేని టిడిపి అధినేత చంద్రబాబు కుటిల రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆయన ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజలందరూ జగన్ వెంటే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.



విడపనకల్లులో మహిళలకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

జీతాలిప్పించి.. న్యాయం చేయాలని వినతి

పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్‌లో పని చేస్తున్న పలువురు కార్మికులు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని కలిసి విన్నవించారు. ఈమేరకు గడప గడపకూ వచ్చిన మాజీ ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఆరు నెలలుగా తమతో విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ డోనేకల్ గ్రామాల మీదుగా వెళ్లే జాతీయ రహదారి రోడ్డు పనులను చేయించుకుంటూ ఒక్కపైసా జీతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. మీరైనా స్పందించి వేతనాలు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, వైసిపి మండల కన్వీనర్ బసన్న, ఎంపిడిఒ శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, జిల్లా ఎస్సీ సెల్ కమిటీ సభ్యులు సుంకన్న, మార్కెట్ యార్డు ఛైర్మన్ సుశీలమ్మ, డైరెక్టర్ రమేష్, వైసిపి నాయకులు దేశాయి సిద్ధార్థ, కరణం భీమ్‌రెడ్డి, దేశాయ్ చంద్రనాథ్, దేశాయి మున్నా, గోపాలకృష్ణ, యువరాజు, ఉలిగన్న, బెస్త, ఎర్రిస్వామి, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : గ్రామాల్లో సచివాయాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తెచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు మంగళవారం మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు ఎంతో దూరం నుంచి ఎరువుల బస్తాలను భుజాల మీద మోసుకుని వచ్చే పరిస్థితి నుంచి గ్రామాల్లోనే ఎరువులను తీసుకునే స్థాయికి పాలన వచ్చిందన్నారు. అంతేగాకుండా అధికారులతోపాటు, నాయకులు ప్రజల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జడ్పిటిసి నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, బొందలవాడ రంగయ్య, నారాయణ, భాస్కర్‌నాయుడు, రఘువీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హెచ్ఎల్సీలో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

బొమ్మనహాల్ : మండలంలోని ఉంతకల్లు గ్రామ సమీపంలోని హెచ్ఎల్‌సి ప్రధాన కాలువలో వ్యక్తి శవం లభ్యమైనట్లు గ్రామ విఆర్ఒ వన్నూరప్ప తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బళ్లారిలో వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న హిందూపురానికి చెందిన జుబిహుల్ (38) ఆదివారం సాయంత్రం హెచ్చెల్సీలో స్నానం చేస్తుండగా కాలు జారి పడి గల్లంతైనట్టు మతుడు భార్య నాసిబా అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో మంగళవారం ఉంతకల్లు సమీపంలో శవం బయటపడినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పరీక్ష నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

ఆటో నుంచి జారిపడి వ్యవసాయ కూలీ మృతి

నార్పల : మండల పరిధిలోని సుగాల కొట్టాలకు చెందిన రామాంజనమ్మ (32) ఆటోలో నుంచి జారిపడి మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక సుగాల కొట్టాలలో నివాసం ఉండే రామాంజనమ్మ 20 ఏళ్ల క్రితమే భర్త చనిపోవడంతో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఈమెకు ఒక కూతురు ఉంది. ఇందులో భాగంగానే కూలి పనికి వెళ్లివస్తుండగా ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారి పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తురకపల్లిలో సిసి రోడ్డు నిర్మాణం

గుత్తి : మండలంలోని తురకపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసరెడ్డి చొరవతో నూతనంగా సిసి రహదారిని నిర్మించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జూలై 14న తురకపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యేకు ఓసీ కాలనీ వాసులు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. దీంతో త్వరలోనే సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. మాటిచ్చిన ప్రకారం ఎమ్మెల్యే నిధులు రూ.10లక్షలు కేటాయించి ఇరవై రోజుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించారు. దీంతో సర్పంచి ఎన్.సుందరమ్మ, ఎంపిటిసి ఎన్.సుమలత, నాయకులు లక్ష్మిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతురెడ్డి, రంగస్వామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ఎమ్మెల్యేతోపాటు మండల ఇన్‌ఛార్జికి కృతజ్ఞతలు తెలిపారు.



తురకపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

21లోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

శింగనమల : ఈనెల 21వ తేదీలోపు అధికారులు ఇంటింటి ఓటరు జాబితా పూర్తి చేయాలని ఎన్నికల ప్రత్యేక కలెక్టర్ బి.సుధారాణి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సర్వేపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు త్వరితగతిన ఇంటింటికీ వెళ్లి సర్వే పూర్తి చేయాలన్నారు. అర్హులైన ఓటర్లను గుర్తింపులో అలసత్వం వహించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటి రామకృష్ణ, ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెన్నప్పయాదవ్, నాయకులు రామ్‌చరణ్‌యాదవ్, ఎన్‌వి నారాయణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ డబ్బాలు మానండి.. : వైసిపి

రాయదుర్గం : మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు డబ్బా సెల్ఫీ వీడియోలు చేయడం మానుకోవాలని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మాధవరెడ్డి హితవు పలికారు. మంగళవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొద్ది వారాలుగా కాలవ శ్రీనివాసులు సెల్ఫీ ఛాలెంజ్‌ల పేర విడుదల చేస్తున్న మీడియా ప్రకటనలు వాస్తవానికి సత్యదూరం అన్నారు. గతంలో తాను మంత్రిగా చేసిన సమయంలో ఏం అభివృద్ధి చేశాడో చెప్పుకుంటే మంచిదని సూచించారు. ఇప్పటికైనా ఆయన సెల్ఫీ రాజకీయాలు మానకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండె వైద్యశిబిరానికి స్పందన

నార్పల : మండల పరిధిలోని తిక్కస్వామి ఆలయ ఆవరణంలో అనంతపురం ప్రభుత్వ వైద్యశాల కమిటీ సభ్యులు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా అనంతపురం మార్క్ గుండె ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అమర్ సహకారంతో సుమారు 250 మందికి గుండె పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అమర్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒక్కసారి సాధారణ గుండె పరీక్షలైన ఈసీజీ, ఎకో టెస్టు, ట్రెడ్మిల్ టెస్ట్ చేయించుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్‌వలి, పెద్దిరెడ్డి, అమీర్ బాషా, భాస్కర్‌నాయుడు, జామకాయల నర్సింహులు, తిక్కస్వామి ఆలయ కార్యనిర్వాహకులు గవ్వల సుబ్బయ్య, ప్రతాప్‌చౌదరి, యంగమునిరెడ్డి, మార్క్ వైద్యశాల సిబ్బంది డాక్టర్ ఆర్షద్ అలీ, విష్ణువర్ధన్, బాబూరావు, నరేష్, క్రాంతి, పూజిత, వినోద్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యాడికిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

యాడికి : టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టనున్న పథకాలను వివరిస్తూ చేపట్టిన 'భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి మంగళవారం మండల కేంద్రంలోని ఆసుపత్రి కాలనీలో పర్యటించారు. ముందుగా తిప్పారెడ్డిపల్లి రోడ్డు నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు వేలూరు రంగయ్య, తిరునాథ్‌రెడ్డి, ఆది, నాగమణిరెడ్డి, మాదాల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి పోలీస్‌స్టేషన్ తనిఖీ

గుత్తి : పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా శిథిలమైన పోలీస్ క్వార్టర్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సమస్యలపై స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ రామకృష్ణారెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి

ఎపిఇఎస్ఇఎ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జూన్‌లో బదిలీలు, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్‌ను సాకుగా చూపించి రెండు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్‌ను సరి చూసుకోకుండా సర్దుబాటు చేయడం ద్వారా దాదాపు 60 వేల మంది టీచర్లు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు రాక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.